క్లుప్తంగా

నేడు కృష్ణాష్టమి వేడుకలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ఎర్రవంతెన వద్ద కొలువై ఉన్న శ్రీకృష్ణాలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి పంచామృతాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ సాయంత్రం చిన్ని కృష్ణుడు గోపికమ్మ వేష ధారణ పోటీలు, రాత్రి ఉట్టి మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 1న అన్న సమారాధన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మన్నే శ్రీనివాస్, యియ్యపు భాస్కరరావు, ముగడ శ్రీనివాస్‌లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పెద్దింట్లమ్మకు సారె సమర్పణ



పెద్దింట్లమ్మవారికి సారెను సమర్పిస్తున్న మహిళలు

ఆకివీడు: ఆకివీడు గ్రామ దేవత శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారికి ఆదివారం శ్రావణమాస సారెను భక్తులు సమర్పించారు. ఆకివీడు పంచాయతీ పరిధిలోని 13వ వార్డులో ఉన్న మార్టేరు సాహెబ్ గారి వీధి, నాయుడు వీధులకు చెందిన మహిళలు అమ్మవారికి ఈ సారె అందించారు. ఈ సందర్భంగా సన్నాయి వాయిద్యాలతో ఆ ప్రాంతం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం అమ్మవారికి చలివిడి, పానకాలు, పసుపు కుంకుమ, గాజులు, పిండి వంటలు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న దాత

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన విద్యా చైతన్య శ్రీనివాస దీప్తి 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. తొలుత దాత కుటుంబం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మత్తుకు యువత దూరంగా ఉండాలి



ఏలూరుపాడులో అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

కాళ్ల: మత్తు పదార్థాలకు, గంజాయికి యువత దూరంగా ఉండాలని ఎస్సై ఎస్.శ్రీనివాసరావు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆకివీడు సీఐ పర్యవేక్షణలో ఏలూరుపాడు గ్రామంలో ఆదివారం పోలీసు సిబ్బందితో కలిసి యువతకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత జీవితాలు దుర్భరమవుతాయని అన్నారు. అతివేగంగా వాహనం నడిపి ప్రాణాలు కోల్పోతున్నారని, మత్తు పదార్థాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై ఎటువంటి కేసులు నమోదు చేస్తారు, ఏఏ శిక్షలు విధిస్తారో వివరించారు.

15న గుండె ఆపరేషన్లు

పెంటపాడు: సెప్టెంబర్ 15న ప్రత్తిపాడు ట్రిపుల్ ఎఫ్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో 1 నుంచి 14 సంవత్సరాల లోపు చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్‌లు నిర్వహించనున్నట్లు ట్రిపుల్ ఎఫ్, స్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధి ఓపీ గోయంకా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్టార్ ఆసుపత్రి చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ సుమన్ చిన్నారులకు ఆపరేషన్‌లు నిర్వహిస్తారని పేర్కొన్నారు. గుండె సంబంధిత వ్యాధులు ఉన్న చిన్నారుల పేర్లు తప్పక నమోదు చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలను 99496 49519, 63042 40277 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పురపాలక సంఘ కార్యాలయ బోర్డు ఏర్పాటు



ఆకర్షిస్తున్న నూతన బోర్డు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పురపాలక సంఘం కార్యాలయం వద్ద లైటింగ్ బోర్డును ఏర్పాటు చేశారు. అయితే గతంలో రాత్రి సమయంలో ఆ ప్రాంతమంతా చీకటిగా ఉండేది. ప్రస్తుతం విద్యుత్ విద్యుత్ వెలుగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. విద్యుత్ వెలుగులతో పాలకొల్లు పురపాలక సంఘ కార్యాలయం బోర్డుతో వెంకట్రామా ఏసీ సెంటర్‌కు మంచి వెలుగొచ్చిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రాణాలు పోసే మాకే రక్షణ లేదా..?



రోగులకు ప్రాణాలు పోసే వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా..? డాక్టర్లకు రక్షణ పటిష్టమైన చట్టాలు తీసుకుని రావాలి. ముఖ్యంగా మహిళావైద్యుల రక్షణకు కఠినమైన చట్టాలు అమలు చేయాలి. గ్రామాల్లోను, పట్టణాల్లోనూ ఆస్పత్రులు దూరంగా ఉంటాయి. రాత్రి వేళల్లో ఆసుపత్రుల వద్ద పటిష్టమైన చర్యలు చేపట్టి, వైద్యులకు, సిబ్బందికి పూర్తి రక్షణ కల్పించాలి.

– డాక్టర్ కె.లక్ష్మీ పార్వతి, మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి

భయాందోళనలో డాక్టర్లు



కోల్‌కతా సంఘటనతో డాక్టర్లమంతా ఆందోళనతో విధులు నిర్వర్తిస్తున్నాం. రోగి ప్రాణాలు కాపాడే డాక్టర్లు దైవంతో సమానమనే నానుడిని కొంత మంది వ్యక్తులు అగౌరవపరుస్తున్నారు. ప్రతి ఆసుపత్రి ఆవరణలో పోలీస ఔట్‌పోస్టును ఏర్పాటు చేసి పగలు, రాత్రి వైద్యులకు రక్షణ కల్పించాలి. దేశంలోని వైద్యుల రక్షణకు ప్రత్యేకమైన రక్షణ చట్టం తీసుకురావాలి. డాక్టర్ల రక్షణకు సుప్రీం కోర్టు తీసుకున్న చర్యలు హర్షణీయం.

– డాక్టర్ ఒ.దినేష్, మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి

నరసాపురంలో డ్రెయిన్లు అధ్వానం

- ప్రధాన రోడ్లపై అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- రోగాలు ప్రబలుతాయని ప్రజల ఆందోళన



ప్రధానమైన బస్టాండ్ ఏరియాలో అధ్వానంగా ఉన్న డ్రెయిన్

నరసాపురం: ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా కూడా నరసాపురం పట్టణం డ్రెయినేజీ వ్యవస్థ నానాటికీ క్షీణిస్తోంది. ప్రణాళికాబద్ధంగా డ్రెయినేజీ నిర్మించకపోవడం, పనుల్లో నాణ్యతా లోపాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. మొత్తానికి డ్రెయినేజీ వ్యవస్థపై ఖర్చు చేస్తున్న ప్రజాధనం అంతా వృథా అన్నట్లుగా పట్టణంలో ఏ డ్రెయినేజీను చూసినా అర్థమవుతోంది. డ్రెయినేజీలు సవ్యంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోగాలు వచ్చేస్తున్నాయని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

అన్ని డ్రెయిన్లు అధ్వానమే..

పట్టణంలో బస్టాండ్ సెంటర్, మాధవాయిపాలెం, రాయిపేట, రుస్తుంబాద ప్రాంతాల్లో ప్రధాన డ్రెయినేజీలున్నాయి. వార్డుల్లోని పలు వీధుల్లో ఉన్న ఉప డ్రెయిన్లన్నీ ఈ ప్రధాన డ్రెయినేజీల్లో కలుస్తాయి. ప్రధాన డ్రెయిన్లన్నీ గోదావరిలో ఐదు చోట్ల కలుస్తాయి. మురుగు గోదావరిలో కలిచే చోట ఔట్ ఫాల్ స్లూయిజ్‌లు కూడా సరిగా లేవు. గోదావరిలో మురుగు కలిసే చోట అవుట్‌లెట్‌లు సరిగా లేకపోవడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా ఉంటుంది. ఇక డ్రెయినేజీలు అధ్వానంగా ఉండడంతో వర్షం వస్తే బస్టాండ్ ఏరియా, పొన్నపల్లి, నందమూరి కాలనీ, వైఎస్సార్ నగర్ ప్రాంతాలు వర్షం నీరు పారక నీటమునుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో వర్షపునీరు సవ్యంగా పారేటట్లు డ్రెయినేజీలను ఆధునికీకరించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే 21, 22,23, 24, 25, 26, 27 వార్డులు, పొన్నపల్లి, మాధవాయిపాలెం, స్టేషన్ పేట ప్రాంతాల్లో మైనర్ డ్రెయిన్స్‌ను వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉంది.

అయోమయంలో స్పెషల్ ప్రాజెక్ట్

నరసాపురం మున్సిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.220 కోట్లు మంజూరు చేసింది. ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధించి రూ.87 కోట్లతో మొదటి దశలో పనులు చేయించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మాజీ ప్రభుత్వ ఛీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో మొదటి దశలో 1 నుంచి 9 వరకూ వార్డుల్లో పనులు మొదలు పెట్టేలా టెండర్లు కూడా పిలిచారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థతో పట్టణంలో అస్తవ్యస్థంగా ఉన్న డ్రెయిన్లకు మోక్షం కలుగుతుందని భావించారు. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఈ అంశం మరుగున పడిపడిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నరసాపురంలో డ్రెయినేజీ వ్యవస్థను ఆధునికీకరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పట్టణంలో డ్రెయిన్లు ఇలా

పట్టణ జనాభా	60వేలు
ప్రస్తుతం డ్రెయిన్స్ విస్తీర్ణం	25.450 కిమీ
పక్కా డ్రెయిన్స్	12. 697 కిమీ
కచ్చా డ్రెయిన్స్	8.493 కిమీ
మేజర్ డ్రెయిన్స్	4.260 కిమీ
డ్రెయిన్స్ నిర్మించాల్సిన ప్రాంతం	4 కిలోమీటర్లు (సుమారుగా)

200 మందికి వైద్య పరీక్షలు



పాలకొల్లు టిడ్కో గృహాల సముదాయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ పంచాయతీ పెంకుళ్లపాడు టిడ్కో గృహాల సముదాయంలో శ్రీతిరుమల హాస్పటల్ వైద్యుడు వట్లూరి రమేష్ ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు అధికంగా ఉంటున్నాయని దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శిబిరంలో సుమారు 200 మంది రోగులను పరీక్షించారు. సుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులు, కీళ్ల నొప్పులు, జ్వరాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యాతం రమేష్, పి రవికుమార్, దొంగ ప్రసాద్, కొమ్ముల కాశి విశ్వనాథ్, వెంకటరమణ, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం కోసం రైతన్నల ఎదురుచూపులు



పెనుగొండలో సాగులో చేను

పెనుగొండ: సాగు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా పెట్టుబడి సాయం ఊసే లేకపోవడంతో రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా కింద కేంద్ర ప్రభుత్వం సాయంతో కలిపి రైతన్నకు రూ.13,500 పెట్టుబడి సాయం అందించేది. ఐదేళ్ల పాటు ఎక్కడా ఆలస్యం లేకుండా సాగు మొదట్లోనే రైతుల ఖాతాల్లో రెండు విడతల్లో నేరుగా జమ చేసేవారు. అయితే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వస్తే రైతన్నలకు రూ.20 వేలు పెట్టుబడి సాయమందిస్తామంటూ నమ్మబలికారు. దీంతో రైతన్నలు కూటమికి అండగా నిలిచారు. తీరా అధికారం లోకి వచ్చిన తరువాత నేటి వరకూ పెట్టుబడి సాయం ఊసే లేకపోవడంతో రైతన్నలు డీలా పడుతున్నారు.

పేరు మార్చి ఏమార్చి..

వైఎస్సార్ రైతు భరోసాను కాస్తా ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఆర్భాటంగా అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్చి చేతులు దులుపుకున్నారు. అయితే ఆ పథకం అమలు విధివిధానాలను ఇప్పటి వరకూ ప్రకటించలేదు. ఆచంట మండలంలో 10.500 ఎకరాలు, పెనుగొండ మండలంలో 12672 ఎకరాలు, పోడూరు మండలంలో 13500 ఎకరాలు, పెనుమంట్ర మండలంలో 13700 ఎకరాలు సాగు చేస్తున్నారు. వీరిలో పెనుమంట్ర మండలంలో 2700 మందికి పెనుగొండ మండలంలో 3200 మందికి, ఆచంట మండలంలో 2500 మందికి, పోడూరు మండలంలో 1800 మందికి రైతు భరోసా సాయం అందేది. సాగు ప్రారంభమై రెండు నెలలు అవుతుంది. సాగు ప్రారంభమైన తరువాత కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ప్రభుత్వం ఆదుకుంటుందని భావించినా నేటి వరకూ ప్రభుత్వ పెట్టుబడి సాయం అందించకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పెట్టుబడి సాయం అందించాలంటూ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులను మోసం చేస్తున్నారు



రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామంటూ ఎన్నికల్లో ఆర్భాటం చేసి ఇప్పటి వరకూ అందించాలేదు. పీఎం కిసాన్ నిధులు విడుదలైనా, రాష్ట్ర ప్రభుత్వ సాయం మాత్రం విడుదల చేయలేదు. పేరు మార్చి చేతులు దులుపుకున్నారు. సాయం మాటే మరచిపోయారు. సత్వరం పెట్టుబడి సాయం నిధులు విడుదల చేయాలి.

– దంపనబోయిన బాబూరావు, సోమరాజు చెరువు

తాళాబత్తులకు తెలుగు వెలుగు పురస్కారం



తాళాబత్తుల వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న యువ కళావాహిని సాంస్కృతికి సంస్థ సభ్యులు

పాలకొల్లు అర్బన్: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవాల్లో భాగంగా యువ కళావాహిని సాంస్కృతిక సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో గుంటూరు అన్నమయ్య కళా వేదికపై నిర్వహించిన తెలుగు వెలుగులు పురస్కారాన్ని ప్రముఖ నాటక రచయిత, నటులు, దర్శకుడు, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తాళాబత్తుల వెంకటేశ్వరరావుకి అందజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక విలేకరులకు వివరాలను వెల్లడించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు అందించే ఈ పురస్కారం నాటక రంగ విభాగంలో తనకు లభించడం ఆనందంగా ఉందనిప పేర్కొన్నారు. యువ కళావాహిని ప్రతినిధులు లంకా లక్ష్మీనారాయణ, జి.మల్లికార్జునరామ్‌లు వెంకటేశ్వరరావును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. తాళాబత్తుల సైకత శిల్పం, సప్తపది, నాన్నా నేనొచ్చేస్తా, అనూహ్యం, దిష్టిబొమ్మలు, విలువ-విలువలు, అమ్మ ఒడి తదితర నాటికలను రచించారు. తాళాబత్తులకు పురస్కారం లభించడంపై పాలకొల్లు కళా సంస్థల ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

'మానవత' సేవల విస్తరణ



ఆచంటలో మానవత సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆచంట మానవత శాఖ ఆధ్వర్యంలో సేవలు మరింత విస్తరించనున్నట్లు ఆచంట మండల శాఖ అధ్యక్షుడు కుక్కల లీలా ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆచంట భవ్యభారతిలో నిర్వహించిన మానవత మండల శాఖ సమావేశంలో పాల్గొన్నారు. కొడమంచిలి, పెనుమంచిలి, ఆచంట వేమవరంల్లో సభ్యత్వాలు పూర్తి చేయడం, ఆగష్టులో ఉచిత దంత వైద్య పరీక్షా శిబిరం ఏర్పాటు, ప్రభుత్వ ఆసుపత్రిలో బేబీ కిట్స్, పండ్లు పంపిణీ కార్యక్రమాలను వివరించారు. మరింతగా రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సభ్యులందరూ సహకరించి, ఆచంట శాఖను సేవల్లో ముందంజలో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బొక్కా రామకష్ణ, రీజియన్ కన్వీనరు బుద్ధిరాజు విద్యా సాగర్, మండల చైర్మన్ సంబూరి అంజిబాబు, కో-చైర్మన్ వేండ్ర శ్రీనివాస్, వేమూరి నాగేశ్వరరావు, కొమ్మనపెద్ది సూర్యనారాయణ శర్మ, కొలుకులూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే పూజించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): వినాయక చవితి ఉత్సవాలకు మట్టి విగ్రహాలనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో ప్రజలలో అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కలిగొట్ల గోపాలశర్మ, చైతన్య భారతి సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, సంగీత ఉపాధ్యాయులు పైడిరాజు కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంగులు, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను పూజకు ఉపయోగించి నదులు, కాలువలలో కలపడం ద్వారా నీరు కలుషితమై పర్యావరణం దెబ్బతింటుందన్నారు. పది రోజులపాటు ఈ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు రంగసాయి తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



నరసాపురంలో లఖ్‌పతి దీదీ కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మహిళల జీవన ప్రమాణాలను పెంచి వారు ఆర్థికంగా ఎదిగేందుకు లఖ్‌పతీ దీదీ యోజన కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్ అన్నారు. ఆదివారం నరసాపురం స్టీమర్‌రోడ్డులోని వెలుగు డీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించబడిన లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని డ్వాక్రా మహిళలతో కలిసి బిగ్ స్క్రీన్‌పై వీక్షించారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఈ పథకానికి సంబంధించిన విధి విధానాలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో నడిపూడి పండు, మునుకోటి వెంకటేశ్వరరావు, ఏపీఎం పిప్పళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లఖ్‌పతీ దీదీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పెనుగొండ మండల ఏపీఎం జి.ప్రభుదాస్ అన్నారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లఖ్‌పతి దీదీ కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందించారు.

120 మందికి కంటి పరీక్షలు



సిద్ధాపురంలో ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: అంధత్వాన్ని అంతమొందించేందుకు నిరంతరం కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని లయన్స్ ప్రతినిధి వంటల కృష్ణమూర్తి చెప్పారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఆదివారం లయన్స్ క్లబ్, ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన కృష్ణమూర్తి మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల కంటి లోపాలను సరిచేసుకోవచ్చునన్నారు. వయసుతో వచ్చే కంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో 120 మంది కంటి పరీక్షలు చేయించుకోగా, వీరిలో కొంతమందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, ఉప సర్పంచ్ నారాయణరాజు, స్థానిక పెద్దలు లయన్స్ ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ' ఓటర్ల నమోదు వేగిరపర్చాలి

భీమవరం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా అర్హత గల ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఓట్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని యూనియన్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ విద్యా రంగంలో పేరుకు పోయిన సమస్యల పరిష్కారానికి ఉద్యమ సంఘాల అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకుని, సమస్యలను పరిష్కరించే వారిని ఎన్నుకోవాలని సూచించారు.2018 నవంబర్ 1వ తేదీ నుంచి పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు హక్కుకు అర్హులన్నారు. ఓటరు నమోదుకు సెప్టెంబర్ 3 చివరి తేదీ అని, అర్హత గల ఉపాధ్యాయులంతా తక్షణమే ఓటరు నమోదును చేసుకోవాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాయి వర్మ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కేవీ రామచంద్రరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.దావీదు, జిల్లా ఆర్థిక కార్యదర్శి పీవీడీ ప్రసాద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అడ్డాల కృష్ణ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: తీర ప్రాంత గ్రామాల్లో ప్రసిద్ధి చెందిన బండి ముత్యాలమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రావణ మాసం అందునా ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఈఓ డి.రామకృష్ణం రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాచేనమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

పెనుగొండ: పెదమల్లం మాచేనమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం మాచేనమ్మ ఆలయానికి ఉభయ గోదావరి జిల్లాల నుంచి భక్తులు అధికంగా వస్తూ ఉంటారు. శ్రావణ మాసం సందర్భంగా ఈ ఆదివారం భక్తుల తాకిడి మరీ ఎక్కువగా ఉండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగాణం కిటకిటలాడింది. భక్తులు మొక్కులు తీర్చుకొని అమ్మవారికి నైవేథ్యాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు చేశారు.

అమ్మవార్లకు మహానివేదన

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం 18వ వార్డులోని శ్రీనివాస సెంటర్ లో శ్రీఆదిలక్ష్మి రాజ్యలక్ష్మి పోలేరమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవంలో భాగంగా అమ్మవారి జాతర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆదివారం ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక పూజలను నిర్వహించి మహా నివేదన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నిదానాల కెల్లా అన్నదానం ఎంతో గొప్పదని, దైవ కార్యక్రమాల్లో అన్న సమారాధనలు నిర్వహించడం భగవత్ సేవతో సమానమన్నారు. అనంతరం 2 వేల మంది భక్తులు అమ్మవారిని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, పిప్పళ్ళ ప్రసాద్, యలమంచిలి శ్రీనివాస్, గోపి, ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు కాళ్లకూరులో ఆలయం మూసివేత

కాళ్ల : కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆలయం మూసివేయనున్నట్లు దేవస్థానం ఈఓ ఎం.అరుణకుమార్ ఆదివారం తెలిపారు. సంప్రోక్షణ పూజా కార్యక్రమం అనంతరం ఆలయం తెరచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. అదేవిధంగా రాత్రి 7 గంటలకు స్వామివారికి 12 రకాల విశేష ప్రసాదాలతో నైవేద్యం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

లోవోల్టేజ్ సమస్య లేకుండా చర్యలు

కాళ్ల: దొడ్డనపూడిలో లోవోల్టేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని విద్యుత్ శాఖ మండల ఏఈ రాంబాబు తెలిపారు. గ్రామంలో లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని విద్యుత్ శాఖ సీజీఎం దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లిన దృష్ట్యా ఆదివారం అధికారులు గ్రామంలో ప్రతి ఇంటిని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారం నిమిత్తం గతంలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ఇంకా గ్రామంలో ఏదైనా విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే లిఖిత పూర్వకంగా తెలియజేస్తే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

కాళ్ల: పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎన్.శ్రీనివాసరావు ఆదివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బొండాడపేట గ్రామ శివారు నేరేడుగురువులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2,050 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

30న సామూహిక వ్రతాలు

పెంటపాడు: భక్తుల కోర్కెలు తీర్చే ప్రత్తిపాడు వై జంక్షన్ కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవార సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఈ నెల 30న ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో శ్రీదేవి, దేవాదాయశాఖ అధికారి మొగ్గళ్లపు పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొత్తలంక శివ సత్యనారాయణ బ్రహ్మత్వంలో ఉదయం 9 గంటల నుంచి ఉచిత సామూహిక శ్రావణ లక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తారని, ఆసక్తి ఉన్న ముందుగా ఆలయం వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.